# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 23 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రెవెన్యూ శాఖలో 10,954 పోస్టులు మంజూరు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం జీవో 41ని జారీ చేశారు. నూతన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు (జీపీఓ)గా ప్రభుత్వం నామకరణం చేసింది. మాజీ వీఆర్వోలు , మాజీ వీఆర్ఏ ల నుంచి ఆప్షన్లు తీసుకుని వీటి నియామకాలు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన తదుపరి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ఆర్థిక శాఖ కోరింది.



# సింగిల్‌గా అధికారంలోకి వస్తాం

- ఒక్కో కార్యకర్త ఒక్కో కేసీఆర్ కావాలి
- తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు
- ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవారు కాదు
- కాంగ్రెస్ నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది.

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాబోయే రోజుల్లో మళ్లీ సొంతంగానే అధికారంలోకి వస్తామని తెలంగాన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బెల్లం ఉన్న దగ్గరికే ఈగలు వస్తాయని.. తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని ఆయన హాట్ కామెంట్ చేశారు. పదేళ్లుగా తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు లేవని.. కానీ ఇప్పుడు తెలంగాణ సమస్యల వలయంలో చిక్కుకుందని కేసీఆర్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఏపీలో పొత్తు లేకుంటే చంద్రబాబు గెలిచేవారు కాదన్నారు.

కాళేశ్వరం నీళ్లు అందక పంటలు ఎండిన రైతన్నల గుండె కోతలను సభ్య సమాజానికి తెలిపేందుకు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో రామగుండం నుంచి ఎర్రవల్లి వరకు 200 మందితో కూడిన 180 కిలోమీటర్ల పాదయాత్ర వారం రోజుల పాటు కొనసాగి, శనివారం ముగిసింది. ఈ ముగింపు సభ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ ప్రగతి పాలనలో జలాలతో అలుగెల్లిన గోదావరి, కాళేశ్వరం ప్రాజెక్టులు.. కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువుతో చెరువులు, కుంటలు అడుగంటి ఎడారిగా మారాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. "తలాపున పారుతుంది గోదారి నీ చేను నీ చెలుక ఎడారి.." అని నాటి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నీటి కష్టాలను వివరిస్తూ, నాటి కవి సదాశివుడు రాసిన పాటను తిరిగి గుర్తుకుచేసుకునే పరిస్థితులు తలెత్తడం శోచనీయం. పోయిన సంవత్సరం ఇదే రోజు నిండు కుండల్లాంటి కాళేశ్వరం ప్రాజెక్టులు నేడు ఎందుకు ఎండిపోయినాయో.. ఇందుకు కారణం ఎవరు అనే విషయాన్ని సభ్యాసమాజానికి తెలియజేసేందుకు కోరుకంటి చందర్ అధ్వర్యంలో పాదయాత్ర చేయడం అభినందనీయం

తెలంగాణను కొట్లాడి సాధించుకున్నాం. ఎంతో జాగ్రత్తగా నిలబెట్టుకున్నం. ప్రజలు ఏమనుకున్నారో ఏందో కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నరు. అది వాళ్లిష్టం. కానీ దాని ఫలితం లోకం చూస్తున్నదిఇన్నాళ్ళు లేని నీటి గోస ఇప్పుడెందుకు వచ్చినట్టు? తెలంగాణకు నీళ్లు ఇవ్వాలనే పాలనా ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే తెలంగాణకు సాగునీరు తాగునీరు సమస్య వచ్చింది. తెలంగాణ పాలకులు మొదటి నుంచీ నీటి సమస్యను ఆర్థిక సమస్యగా చూడడం ఒక అవలక్షణంగా మార్చుకున్నారు. గల్ఫ్ లాంటి ఎడారి దేశాల్లో నీళ్లుండవు. అక్కడి ప్రభుత్వాలు సముద్ర జలాల నుంచి ఉప్పును వేరుచేసి నీటిని శుద్ధి చేసి మంచినీరుగా వాడుకుంటారుమద్రాస్‌లో కూడా నీటి కొరతను అధిగమించేందుకు అటువంటి కార్యాచరణను చేపట్టారు. భౌగోళిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజల శ్రేయస్సును పరిగణలోకి తీసుకొని ప్రభుత్వాలు పనిచేయవలసి ఉంటుంది. అంతేతప్ప వాటిని ఖర్చుకు లింకు పెట్టి ఆలోచన చేయడం తప్పు.

తెలంగాణకు సాగునీరు తాగునీరు అవసరం. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుకు వెనకాడకుండా ప్రజలకు తాగునీరు వ్యవసాయానికి సాగు నీరు అందించాల్సిందే. తెలంగాణ రాగానే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, వ్యవసాయ స్థిరీకరణ కోసం దృష్టి సారించి పటిష్టమైన కార్యాచరణను అమలు చేసింది. రైతాంగ వ్యవసాయ అభివృద్ధి పాలనా ప్రాధాన్యతాంశంగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంచుకుంది. అందులో భాగంగా.. ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందివ్వడం. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు ఉచితంగా అందించడం. పంట పెట్టుబడి సాయం చేయడం.

మిగితా 2వ పేజీలో

## రోడ్డు ప్రమాదంలో అడిషనల్ డీసీపీ మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



రోడ్డు ప్రమాదంలో అడిషనల్ డీసీపీ మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మారెడ్డిపాలెంలోని మైత్రి కుటీర్‌లో నివాసముంటున్న అడిషనల్ డీసీపీ టీఎం. నందీశ్వర బాబ్జి (50) ప్రతిరోజూ మాదిరిగానే శనివారం వేకువజామున మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హనుమాన్ దేవాలయం నుంచి రోడ్డు దాటుతుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వస్తున్న నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 39వీఏ 9563) అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో అతనితలకు తీవ్ర రక్తం రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన బాబ్జి స్వస్థలం ఆంధ్రప్రదేశ్. రాచకొండ కమిషరేట్‌లోని కంట్రోల్ రూమ్, షీ టీం ఏసీపీగా పనిచేశారు. మూడు రోజుల క్రితం అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ఆయన ఇంకా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంది.

# డీ లిమిటేషన్ వల్ల అనేక నష్టాలు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

డీ లిమిటేషన్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు అని పేర్కొన్నారు. చెన్నైలో జరిగిన దక్షిణ భారతదేశ రాష్ట్రాల పార్టీల సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఆధ్వర్యంలో 14 ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమం నడిపించారు. 14 సంవత్సరాల అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నాం. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తి తీసుకుంటాం. అస్తిత్వం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చింది. ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచీ లెక్క పని చేస్తుందన్నారు కేటీఆర్. డీ లిమిటేషన్ వల్ల అనేక నష్టాలు. కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత విధానాలతో దక్షిణాది రాష్ట్రాలకు అనేక నష్టాలు. దేశ అభివృద్ధి కోసం పని చేసినందు వల్ల ఇవాళ నష్టం జరుగుతుంది. మనమంతా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు అని పేర్కొన్నారు. దేశానికి 36 శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతున్నాయి. డీలిమిటేషన్ కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడమే కాదు.. ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉంది. మొదటి నుంచి దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోంది. ఎన్డీఏ పాలనలో దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష మరింత పెరిగింది. వివక్షను కొనసాగించేందుకు డీలిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకొస్తుంది. బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులను ఉత్తరాదికే పరిమితం చేయడం ఒక ఉదాహరణ. జనాభా దామాషా ప్రకారం డీలిమిటేషన్ జరిగితేనే దేశ సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఐక్యంగా పోరాడాలి

- విబేధాలను పక్కన పెడదాం
- త్వరలోనే హైదరాబాద్‌లో సమావేశం
- ప్రజలను భాగస్వామ్యం చేయడానికి భారీ బహిరంగసభ
- దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియత్రణ పాటించాయి
- దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోంది.
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- పునర్విభజనపై స్టాలిన్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ తీర్మానం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు విభేదాలను పక్కనపెట్టి తమ వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పునర్విభజన ప్రక్రియపై రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని, అదే తరహాలో మిగతా రాష్ట్రాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చెన్నైలో నిర్వహించిన న్యాయమైన పునర్విభజనజాయింట్ యాక్షన్ కమిటీ తొలి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలిగించే పునర్విభజనపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

పునర్విభజన అంశంలో సమావేశంలో అనేక కీలక అంశాలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి, దీనిపై ఐక్య కార్యాచరణ కోసం త్వరలో హైదరాబాద్‌లో తదుపరి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా, ఐక్యంగా మొత్తం భారత దేశానికి వినిపిద్దామని పిలుపునిచ్చారు. "నియోజకవర్గాల పునర్విభజనపై మనందరిని ఏకతాటిపై తెచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి గౌరవ స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నా.

1971లో జనాభా నియంత్రణ పాటించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేశాయి. ఉత్తరాది పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి. జీడీపీ, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయి.

కేంద్ర ఖజానాకు పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ, తిరిగి తక్కువ మొత్తాన్ని పొందుతున్నాం. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే తిరిగి 29 పైసలే వెనక్కి వస్తుంది. ఉత్తర ప్రదేశ్‌కు 2.73 రూపాయలు వెనక్కి వెళుతున్నాయి. బీహార్ రూపాయి చెల్లిస్తే 6.06 రూపాయలు వెనక్కి వెళుతున్నాయి. కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి. అదే సమయంలో మధ్య ప్రదేశ్ రూపాయి పన్ను రూపంలో కేంద్రానికి ఇస్తే వెనక్కి రూ.1.73 పైసలు వెళుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోంది. చివరకు జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకు 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయి.

మనది ఒకే దేశం. మనం దానిని గౌరవిస్తాం. కానీ ఈ నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించం. ఎందుకంటే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలను కుదించడమే. మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ ద్వారా శిక్షిస్తోంది. ఈ అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా అడ్డుకోవలసిన అవసరం ఉంది.

1). సీట్లు పెంచొద్దు. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. 1976లో ఇందిరా గాంధీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ రకంగానే పునర్విభజన చేపట్టారు. లేదంటే రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతలు ఏర్పడేవి. 2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయి గారి నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను కూడా ఇదే రకంగా చేపట్టారు. లోక్‌సభ సీట్లను అదే సంఖ్యలో ఉంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు అదే విధంగా చేయగలరా?

2). జనాభా దామాషా ప్రాతిపదికను పునర్విభజన దక్షిణాది వ్యతిరేకిస్తోంది. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజనను చేపడితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ గళం కోల్పోతాయి. దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదిలో ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించిబడుతుంది.

జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చలాయిస్తాయని అందరూ అంగీకరిస్తున్నారు. ఏ పరిస్థితుల్లోనూ ఈ ప్రతిపాదనను అంగీకరించకూడదు.

3) ప్రొరేటా విధానాన్నీ అంగీకరించలేం. ప్రొరేటా విధానం కూడా దక్షిణాదికి నష్టమే కలగజేస్తుంది. ప్రొరేటా ప్రక్రియ కూడా రాజకీయ అంతరాలను పెంచుతుంది. ప్రొరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది. ఒక్క సీటు కూడా కేంద్రంలో ప్రభుత్వాలను నిర్దేశించగలదు. దేశంలో ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన అనుభవంలో ఉంది.

**ఆమోదయోగ్య ప్రతిపాదనలు**

మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో ఎటువంటి మార్పు తీసుకురావద్దు. సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. పునర్విభజనకు రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకొని చేయాలి. రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా పునర్విభజన చేపట్టాలి.

రాష్ట్రాల్లోని నగరాలు, గ్రామాల్లోని జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల హద్దులను మార్పు చేయాలి. తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సీట్ల సంఖ్య పెంచాలి. ప్రతి రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. లోక్ సభ స్థానాల పెంపును మరో 25 ఏళ్లపాటు వాయిదా వేయాలి.

జనాభా నియంత్రణలో ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టొద్దని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశం ఇవ్వాలి.

మంచి ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి.

**ప్రధాన డిమాండ్లు**

543 సీట్లు ఉన్న లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130. ఇది మొత్తం సీట్లలో 24 శాతం. పునర్విభజన తర్వాత ఏర్పడే నూతన లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 33 శాతం సీట్లు ఇవ్వాలి. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్లను పెంచాలనుకుంటే అలా పెరిగే 272 సీట్లతో మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. ఇందులో 33 శాతం అంటే దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 272 గా ఉండాలి. ఈ సీట్లను దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న ప్రొరేటా ప్రాతిపదికన పంచవచ్చు. దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం పంచవచ్చు. అనుకున్న దానికంటే దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వివరించారు.

## పదో తరగతి పరీక్షలు రాసి వస్తూ..

- బస్సుకిందపడి విద్యార్థిని మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

టెన్త్ పరీక్ష రాసి ఇంటికి బయలుదేరిన విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీకి చెందిన ప్రభాతి ఛత్రియ(16) టెలికాంనగర్‌లో 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. శుక్రవారం మొదటి పరీక్ష రాసిన ఆమె రెండో రోజు శనివారం తన అన్న సుమన్ బైక్‌పై పరీక్షకు వెళ్లింది.మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష అనంతరం ఇద్దరు ద్విచక్ర వాహనంపై లింగపల్లి వైపు బయలుదేరారు. గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీద ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్సు క్రాస్ చేస్తుండగా చక్రాల కింద ద్విచక్ర వాహనం పడిపోయింది. చక్రల కింద పడిన ప్రభాతి అక్కడికక్కడే మృతి చెందగా, పక్కకు పడిన ఆమె అన్నయ్య సుమన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన సుమన్ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నట్లుంది

- డీలిమిటేషన్‌పై విధివిధానాలు ఖరారు కాలేదు
- భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకే ఉత్తరాది, దక్షిణాది అంటూ కుట్ర
- చెన్నైలో డీలిమిటేషన్ సమావేశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజనకు అనుసరించాల్సిన విధి విధానాలే ఇంకా ఖరారు కాకుండా దక్షిణాదికి అన్యాయం జరుగుతుందంటూ కొన్ని పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నంపై మండి పడ్డ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడి 'ఆలూ లేదు.. చూలూ లేదు..కొడుకు పేరు సోమలింగం అన్నట్లుంద'ని వ్యాఖ్యానించారు. చెన్నైలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీని వ్యతిరేకించే పక్షాలు- కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, కమ్యూనిస్టులు శనివారం నాడు సమావేశమవడం పట్ల కిషన్‌రెడ్డి స్పందించారు. పైకి నియోజకవర్గాల పునర్విభజన అని చెప్తున్నప్పటికీ, వాస్తవానికి వారి అజెండా బీజేపీపై విషం కక్కడమేననేది స్పష్టమవుతోందని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గ్యారెంటీల హామీల అమలు వైఫల్యాలతో కాంగ్రెస్, తమిళనాడులో అవినీతి కుటుంబ పాలనతో డీఎంకే తీవ్రమైన

మిగితా 2వ పేజీలో

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఎనిమిదో రోజు ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పై వాడీవేడీ చర్చ జరిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.8,029 కోట్లకుపైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.5,520.60 కోట్ల బకాయి ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4,341 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందన్నారు. దీంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను దశల వారీగా తీరుస్తున్నామని స్పష్టం చేశారు. కాలేజీల యాజమాన్యం పిల్లల సర్టిఫికెట్స్ ఇవ్వడం ఆపొద్దని కోరారు. యాజమాన్యాలకు భరోసా కల్పిస్తామని, ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క యాజమాన్యాలతో మాట్లాడారని చెప్పారు. ప్రస్తుతం పంట రుణమాఫీ పథకం లాంటి వాటికి నిధులు విడుదల చేయడంతో మిగతా శాఖలపై కొద్దిగా భారం పడుతోందని చెప్పారు. దాదాపు రూ.1,200 కోట్లకు టోకెన్స్ కూడా రైజ్ చేసినట్లు తెలిపారు. బిల్స్ అనేవి కంటిన్యూ ప్రాసెస్ అని, దశల వారీగా బకాయిలు చెల్లిస్తామని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన సమయంలోనూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2వేల కోట్లు బకాయిలు పెట్టి పోయిందని కౌంటర్ ఇచ్చారు. వాటిని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాము చెల్లించామని గుర్తుచేశారు. పెద్ద నోట్ల రద్దు, కరోనా వంటి వాటి వల్ల ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నామని చెప్పారు. అయినప్పటికీ ప్రతి సంవత్సరం రూ.2వేల కోట్లకు తగ్గకుండా తొమ్మిదిన్నర ఏళ్లలో రూ.20వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసినట్లు వివరించారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిపారు. బకాయిల వల్ల కొన్ని చిన్న కాలేజీలు నడపడం కష్టంగా ఉందని, పలు కాలేజీలు మూతబడ్డాయని చెప్పారు. వెంటనే బకాయిలు క్లియర్ చేయాలని కోరారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు అద్దె, కరెంట్ బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేయాలని కోరారు. బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ఈ ఏడాదే మొత్తం బకాయిలు క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అరకొర నిధులు కేటాయించడం సరికాదని, బకాయిలు ఇంకా పేరుకుపోయే ప్రమాదం ఉందని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు

మిగితా 2వ పేజీలో

# నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి



- **తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

లోక్‌సభ డిలిమిటేషన్ సమస్యపై రాజకీయ, న్యాయ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు నిపుణుల కమిటీ ఒకదానిని ఏర్పాటు చేయాలని డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శనివారం కోరారు. 'డిలిమిటేషన్ నిష్పాక్షికంగా' జరగాలని ఆయన ప్రతిపాదించారు. అయితే, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం పటిష్ఠత లక్ష్యంగా తీసుకునే చర్యలతో తమకు సమస్య ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. చెన్నైలో తొలి సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి) సమావేశంలో స్టాలిన్ ప్రసంగిస్తూ, తదుపరి జనగణన ఆధారంగా జరగనున్న లేదా భావి జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన కొన్ని రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేయబోతున్నదని చెప్పారు. తెలంగాణ, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు ఎ రేవంత్ రెడ్డి, పినరయి విజయన్, భగవంత్ మాన్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, బిఆర్ఎస్ సీనియర్ నేత కె తారక రామారావు ప్రభృతులు సమావేశానికి హాజరయ్యారు. వివిధ సామాజిక పథకాలు, ప్రగతిశీల సంక్షేమ పథకాల ద్వారా జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు ఈ ప్రక్రియ వల్ల గణనీయంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని స్టాలిన్ సూచించారు.ఈ విషయం గ్రహించే తాను తమిళనాడులో అన్ని పార్టీలతో ఈ నెల 5న ఒక సమావేశం నిర్వహించానని సిఎం తెలియజేశారు. 'ప్రస్తుత జనాభా ప్రాతిపదికపై ఇప్పుడు ఉన్న 543 సీట్లను తగ్గించినట్లయితే తమిళనాడు 8 సీట్లను నష్టపోతుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ లో సీట్లను పెంచినట్లయితే తమిళనాడు ప్రస్తుత ప్రాతినిధ్యం ప్రకారం వాస్తవ పెరుగుదలతో పోలిస్తే 12 సీట్లు నష్టపోతుంది. అది మా రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రత్యక్ష దెబ్బ అవుతుంది' అని ఆయన చెప్పారు. ఆ మరునాడు అంటే ఈ నెల 6న కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా కోయంబత్తూరులో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, తమిళనాడు, ఇతర దక్షిణాది రాష్ట్రాలు దామాషా ప్రాతిపదికపై పార్లమెంటరీ సీట్లను కోల్పోవని చెప్పారని, ఇది అస్పష్టంగా, గందరగోళంగా ఉందని స్టాలిన్ పేర్కొన్నారు. స్టాలిన్ ఈ సందర్భంగా 2023లో తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రచార సభ ప్రసంగాన్ని ప్రస్తావించారు.

'కుల గణన నిర్వహించాలని, జనాభా ఆధారంగా వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ చెబుతున్నది. తదుపరి చర్య డిలిమిటేషన్. కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లుగా ప్రస్తుత జనాభా ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాలను మార్చినట్లయితే, దక్షిణాది రాష్ట్రాలు 100 సీట్లను కోల్పోతాయి. దక్షిణాది ప్రజలు దీనిని అంగీకరిస్తారా?' అని ప్రధాని వ్యాఖ్యానించారని స్టాలిన్ వివరించారు. మోడీ చేసిన ఈ వ్యాఖ్య ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య తగ్గుతుందనని ప్రధాని స్వయంగా 'అంగీకరించార'ని అర్థం అవుతోందని స్టాలిన్ పేర్కొన్నారు. 'బిజెపి రాష్ట్రాలను, వాటి హక్కులను దెబ్బ తీసే పార్టీగా ఉంటోంది. డిలిమిటేషన్ ప్లాన్‌లో తమ దురుద్దేశాలనే అమలుచేయాలని వారు కోరుకుంటున్నారు. ఏ రాష్ట్రమూ దీనిని అనుమతించరాదు. ఈ ముప్పును గ్రహించే తమిళనాడు ఇది వరకు ఎన్నడూ లేని ఐక్యతతో కృషి చేస్తోంది. అటువంటి ఐక్యతనే కోరుతూ తాను డిలిమిటేషన్‌పై జెఎసికి 'నిష్పాక్షిక డిలిమిటేషన్ కోసం జెఎసి' అని పేరు మార్చినట్లు స్టాలిన్ తెలియజేశారు. 'మేము డిలిమిటేషన్‌కు వ్యతిరేకం కాదు. నిష్పాక్షిక డిలిమిటేషన్‌కు మేము అనుకూలమని ఈ పేరు సూచిస్తోంది. ఒక రోజు సమావేశమై, చర్చించి, తీర్మానం ఆమోదించడంతో ఈ పోరాటం ముగియదు. హక్కుల సాధనకు నిరంతర కార్యాచరణ ఎంతో అవసరం' అని స్టాలిన్ చెప్పారు.

డిలిమిటేషన్ ప్రక్రియన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతున్న కత్తిగా అభివర్ణించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ లేదా ప్రజాస్వామ్య సూత్రాలకు బదులు రాజకీయ ప్రయోజనాల దృష్టితోనే ఎవరినీ సంప్రదించకుండా ముందుకు సాగుతోందని ఆయన ఆరోపించారు. జనాభా ఆధారిత డిలిమిటేషన్ దక్షిణాదికి ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తూనే ఉత్తరాది రాష్ట్రాలకు బాగా మేలు చేస్తుందని విజయన్ వాదించారు.

బిజెడి అధ్యక్షుడు, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా సమావేశంలో ప్రసంగిస్తూ, పార్లమెంట్‌లో సీట్ల సంఖ్య నిర్ధారణకు జనాభానే ప్రాతిపదికగా తీసుకోరాదని స్పష్టం చేశారు. డిలిమిటేషన్ ప్రక్రియను ప్రారంభించే ముందు అన్ని పార్టీలతో సమగ్ర చర్చ జరపాలని ఆయన కోరారు. జనాభా ప్రాతిపదికగా డిలిమిటేషన్‌కు పూనుకోవడం అన్యాయమని పట్నాయక్ అన్నారు. బిజెడి సమావేశానికి ఇద్దరు నేతలను పంపింది.

## కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుందని..

- **ఎమ్మెల్యే రాజాసింగ్**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రానికి త్వరలో కొత్త బీజేపీ అధ్యక్షుడు వస్తాడని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా? జాతీయ నాయకత్వమా? అని ప్రశ్నించారు. మరోసారి సొంత పార్టీ నేతలపై రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుందని.. రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారని ఎద్దేవా చేశారు. గతంలో చేసిన అధ్యక్షుడు గ్రూప్ తయారు చేసి పార్టీకి నష్టం చేశారని.. కొత్త అధ్యక్షుడు కూడా అదే గ్రూప్‌ఇజం చేస్తే పార్టీకి మరింత నష్టమని ఆయన అన్నారు. ప్రస్తుతం మంచి నాయకుల చేతులు కట్టి పక్కన పడేశారని.. సీనియర్ నేతలకు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణలో బిజెపి ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు. కొత్త బిజెపి అధ్యక్షుడు సిఎంతో రహస్య భేటీలు నిర్వహించవద్దని అన్న ఆయన అది సీనియర్ నేతలు, కార్యకర్తల మనస్సులో మాట అని దాన్ని బయటపెడుతున్నట్లు తెలిపారు. పార్టీ నేతలకు చెప్పాలే గానీ, మీడియాకు చెప్పవద్దని కొందరు చెబుతున్నారని అన్నారు. పార్టీ పెద్దల దృష్టికి తెస్తే వినకపోతేనే ప్రజల ముందు పెడుతున్న అని తెలిపారు. బిజెపి సీనియర్ నాయకులను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



## మాజీ గవర్నర్ నరసింహన్‌తో కేటీఆర్ బృందం భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,కే.ఆర్.సురేష్ రెడ్డి, మాజీ మంత్రులు గుంతకండ్ల జగదీష్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ సుంకర(శంభీపూర్)రాజు తదితర ప్రముఖులు మాజీ గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ తో భేటీ అయ్యారు.కేటీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం చెన్నైలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నాయకులను ఆహ్వానించి"జేఏసీ ఫర్ ఫేర్ డీలిమిటేషన్"అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న తర్వాత నరసింహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నై అల్వార్ పేటలోని తమ నివాసానికి విచ్చేసిన కేటీఆర్, రవిచంద్ర, సురేష్ రెడ్డి, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, వినోద్ కుమార్,రాజు తదితరులకు నరసింహన్-విమల దంపతులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు నరసింహన్ దంపతులకు పుష్పగుచ్ఛాలిచ్చి, శాలువాలతో సత్కరించారు, యాదాద్రి లక్ష్మీనరసింహ ప్రతిమను,తాజా పండ్లను బహూకరించారు.బీఆర్ఎస్ ప్రతినిధి బృందానికి నరసింహన్ తేనీటి విందునిచ్చి కొద్దిసేపు ఇష్టాగోష్ఠి జరిపారు.

## సింగిల్‌గా అధికారంలోకి వస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పండిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయడం అనే అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని ఎన్ని కష్టాలొచ్చినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. అందుచేతనే పదేళ్లపాటు రాష్ట్ర రైతాంగం ప్రజలు ఎటువంటి బాధలు లేకుండా జీవించారు. కానీ ఇప్పుడున్న ప్రభుత్వం వీటిని అందించడానికి ఖర్చు అవుతుందని వెనకాడుతున్నది. ఇది సరికాదు. ఎప్పుడైనా ప్రభుత్వాలే రైతుల దగ్గర భూమి శిస్తులు వసూలు చేసిన సందర్భాలున్నాయి కానీ ఉల్టా ప్రభుత్వమే రైతుకు భరోసా కల్పించే విధంగా పంట పెట్టుబడి అందించిన పరిస్థితి ఈ దేశంలో ఉన్నదా? రైతు సంక్షేమం దిశగా కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచన ఫలితమే. ఈ పరిస్థితులను తెలంగాణ సమాజం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. మనం ఇచ్చిన కరెంటు ఎటు పోయింది? మనం ఇచ్చిన మిషన్ భగీరథ తాగునీరు ఎందుకు ఇవ్వలేకపోతున్నారు? ఎండాకాలంలో కూడా మత్తడి దునికిన చెరువులు ఇప్పుడు ఎందుకు నీరు లేక ఎండిపోతున్నాయో.. ప్రజలు అర్థం చేసుకోవాలి. పల్లెల నుంచి హైదరాబాద్ వంటి పట్టణాలకు బతకడానికి వచ్చిన పేదలకు నాటి మన ప్రభుత్వం అండగా నిలిచింది. కానీ ఇప్పుడున్న ప్రభుత్వము వాళ్ల ఇండ్లను కూల్చివేస్తున్నది. గోరేటి వెంకన్న లాంటి కవులు రాసిన, గల్లి చిన్నది గరీబోళ్ల కథ పెద్దది వంటి పాటల స్ఫూర్తితో, పేదలకు ఇండ్ల నిర్మాణం చేపట్టినం.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే.. కేసీఆర్ అన్నా ఎక్కడున్నావు రావే.. రావే.. అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ నన్ను ఒడగొట్టి ఇంట్ల కూర్చోబెట్టింత్రు కదా.. నేను ఎక్కడికి రావాలె? కత్తి ఒకనికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎట్లా అయితది? కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్ల పాటు ప్రశాంతంగా బతికినాము అని తెలంగాణ సమాజం భావిస్తున్నది. ఇప్పుడు తిరిగి మళ్లీ పాదయాత్రలు, ధర్నాలు, కొట్లాటలు మొదలైనయి. తెలంగాణకు ఎప్పుడు ఇగ ఇదే లొల్లా? ప్రశాంతంగా బతుకొద్దా? తెలంగాణ సమాజం ఇకనైనా తెలివిగా ఆలోచన చేయాలి. పాదయాత్రలు కాదు మన మనసుతో యాత్రలు చేయాలి బుర్రతో ఆలోచనలు చేయాలి. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను పాడు చేసుకునే ఆలోచనలు కాకుండా మన భవిష్యత్తు తరాలను మరింతగా బాగు చేసుకునే దిశగా ఆలోచన చేయాలి. తెలంగాణకు ప్రధాన శత్రువే కాంగ్రెస్. తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచీ నేటి దాకా పలు సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ మోసాలను చేసింది. నెహ్రూ సహా ఇందిరాగాంధీ, సోనియాగాంధీ నుంచి నేటిదాకా కాంగ్రెస్ తెలంగాణకు ద్రోహాలను చేసింది" అని అన్నారు

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

రూ.10 లక్షల లోపు మూడో వంతు రాయితీ ఇస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పారిశ్రామిక వినియోగం కోసం భూ మార్పిడి చార్జీలు రూ.10 లక్షలకు పరిమితం చేశామన్నారు. యూనిట్‌కు రూ.1.50 చొప్పున నిర్ణీత విద్యుత్ రీయింబర్స్‌మెంట్ ఉంటుందన్నారు. రూ.కోటి పరిమితితో ఐఐడీఎఫ్ నుంచి మౌలిక సౌకర్యాల కల్పన ఉంటుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో మొత్తం 29 వేల కిలోమీటర్ల మేర రహదారులున్నాయని, మన రహదారులే మన సంపదను పెంచుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. పీపీపీ విధానం వేరు.. హైబ్రిడ్ యాన్యుటీ విధానం వేరని తెలిపారు. గత పదేళ్లలో రోడ్లపై రూ.3,945 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. గతంలో రోడ్ల కోసం తెచ్చిన రుణాల బకాయిలు చెల్లిస్తున్నామని మంత్రి అన్నారు. తాము పని ఎక్కువ చేస్తాం.. కానీ మీలా ఎక్కువ మాట్లాడలేమని బీఆర్ఎస్ సభ్యులపై సెటైర్లు వేశారు.

**సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్..**

మంత్రి కోమటిరెడ్డి సమాధానాన్ని నిరసిస్తూ సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా.. ఇతర విషయాలు ప్రస్తావించారనిమండిపడ్డారు.

## ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నట్లుంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా వ్యతిరేకత ఉందన్నారు. అటు బీఆర్ఎస్ అధికారం కోల్పోయి గత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవలేకపోయిందని, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం పోటీ చేసే ధైర్యం కూడా చేయలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించి, భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకువచ్చేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆ పార్టీలపై కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బీజేపీ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని వ్యాఖ్యానించారు. వరుసగా మూడోసారి మోడీ అధికారంలోకి రావడమే కాదు, 15 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా, మరో 6 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్డీఏ పక్షాలు అధికారంలో ఉన్నాయని తెలిపారు. బీజేపీ రోజురోజుకు విస్తరిస్తూ ఉంటే, కాంగ్రెస్ కుచించుకు పోతుందన్న కిషన్‌రెడ్డి నేడు కేవలం 3 రాష్ట్రాల్లోనే అధికారానికి పరిమితం కావడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉందని కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. వివిధ ఎజెండాలతో సమాజంలో అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు.2016లో జేఎన్‌యులో తుక్డే తుక్డే గ్యాంగ్‌ను ముందుపెట్టి విభజన తీసుకొచ్చేందుకు ప్రయత్నించి విఫలమైందని, ఆ తర్వాత బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ, రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసిందని తెలిపారు. అవేవీ పారకపోవడంతో ఇప్పుడు డీలిమిటేషన్ కింద దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందంటూ కాంగ్రెస్ సరికొత్త కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ముందు పెట్టి ఉత్తర- దక్షిణ భారతదేశం మధ్య విభజన తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.డీలిమిటేషన్‌లో తమిళనాడుకు, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న మరో కృత్రిమ వాదాన్ని స్టాలిన్ సృష్టించారని అన్నారు. దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు తదితర పక్షాలు తందానా అంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే అన్న మా ఆరోపణలు నిజమని మరోసారి నిరూపితమైందని కిషన్‌రెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ఏ ఒక్క రాష్ట్రానికి అన్యాయం జరగకుండా అన్ని రాష్ట్రాలను సంప్రదించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా, దేశహితమే లక్ష్యంగా డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొస్తారని తెలిపారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**బలగం టీవీ ,సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ పాఠశాల, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ల్లోని పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదులను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఎంత మంది హాజరు.. గైర్హాజరయ్యారు అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించవద్దని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు...



**బలగం టీవీ , సిరిసిల్ల**

పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, కేంద్రాల వద్ద163 బి ఎన్ ఎస్ ఎస్ -2023 అమలులో ఉంటుందని ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కుసుమరాయ్య, జడ్పీ హెచ్ఎస్ గీతనగర్ తో పాటు పలు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్పీ మహేష్ బి గితే పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించినారు.

ఈ సందర్భంగా ఎస్పి మహేష్ బి గితే మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 35 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 163 బీ ఎన్ ఎస్ ఎస్ -2023 అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు.పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఇక్కడ సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ ,సిబ్బంది ఉన్నారు.

### సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో

## గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేత



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి, కోరెం గ్రామాల మహిళా బీడీ కార్మికులచే, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బూరుగుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఆరు గ్యారంటీలో భాగంగా మహిళా బీడీ కార్మికులకు 4000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, సాధారణ మహిళలకు 2500 పెన్షన్ ఇవ్వాలని, అలాగే సిలిండర్ సబ్సిడీ అమలు చేయాలని బూరుగుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శికి పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి, కోరెం, మహిళా బీడీ కార్మికులు గంగిపల్లి జ్యోతి, గంగిపల్లి ఝాన్సీ, కోల్పుల సునీత, కోల్పుల లక్ష్మి, కోల్పుల భాగ్య, గోపు మనెవ్వ, కోల్పుల రాధ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ పాదయాత్రను స్వాగతిస్తున్నాం...

- **పదేండ్లు రాలేదు.. ఇప్పుడొస్తే మంచిదే..**
- **ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**బలగం టీవీ , హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేపడతామని ప్రకటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. పాదయాత్రను స్వాగతిస్తున్నామని, రోడ్లు కూడా ఖాళీగానే ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పదేళ్లు బయటకు రాకుండా కనీసం ఇప్పుడైనా రావడం మంచిదే అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ మద్దతు ఉందని, అందుకే డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన సమావేశానికి రేవంత్ రెడ్డి వెళ్లారని తెలిపారు. పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కేటీఆర్ ప్రశంసించారని, కానీ అంతకుముందే లేఖలు రాసిన జానారెడ్డి, భట్టివిక్రమార్కను ప్రశంసించడానికి ఆయనకు నోరు రావడం లేదని విమర్శించారు. మెట్రో విస్తరణపై కూడా తాము లేఖలు రాశామని, కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదని ఆరోపించారు. కిషన్ రెడ్డిని కేంద్ర మంత్రిగా మాత్రమే కాదని, బీజేపీ అధ్యక్షుడిగా కూడా చూడాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేసుకోవాలని, పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రి కావాలని ఆయనకు ఉంటుందని వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ వస్తుందని కిషన్ రెడ్డి భావిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే నిధులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

కొత్త ప్రభుత్వానికి కనీసం మూడేళ్ల సమయం ఇవ్వాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 2026లో జనగణన జరిగితే, 2027లో పునర్విభజన జరుగుతుందని, అందుకే స్టాలిన్ ముందుగా అప్రమత్తమయ్యారని వెల్లడించారు. చెన్నైలో జరిగిన సమావేశంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు చిల్లర మాటలని మండిపడ్డారు. అక్కడ సమావేశమైంది దొంగల ముఠానే అయితే హోంశాఖ సహాయ మంత్రిగా పోలీసులను ఎందుకు పంపించలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలను పక్కన పెట్టి ఆలోచన చేయాలని హితవు పలికారు. రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు అనే విషయాన్ని అందరూ గుర్తించాలని సూచించారు. హరీశ్ రావు పాజిటివ్ లైన్‌లోకి వచ్చారని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి అందరికీ ముఖ్యమంత్రి అని గ్రహించి, సమస్యల పరిష్కారం కోసం ఆయనను కలిశారని తెలిపారు.

### ప్రభుత్వానికి తెలియకుండానే

## సర్కులర్ జారీ చేశారనాడం హాస్యాస్పదం

**- ప్రొఫెసర్ హరగోపాల్..**

**బలగం టీవీ , హైదరాబాద్**

ఉస్మానియా యూనివర్సిటీ లో విద్యార్థులు తమ సమస్యలపై నిరసనలు వ్యక్తం చేయెుద్దంటూ వైస్ ఛాన్స్ లర్ ఇచ్చిన సర్క్యులర్ ను ఉపసంహరించుకోవాలంటూ ఓయూ విద్యార్థులు వారం రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓయూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్కు మద్దతుగా అన్ని పౌరసంస్థలు,మేధావులతో పాటు పూర్వ విప్లవ విద్యార్థులలందరూ కలసి రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు... ప్రొఫెసర్ హరగోపాల్ తో పాటు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ,ప్రొఫెసర్ కోదండరాం,సుదర్శన్ రెడ్డి,మాడభూషి శ్రీధర్తో సహా పలువురు మేధావులు జర్నలిస్టు సంఘాల,హక్కుల సంఘాల నాయకులు పాల్గొని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ప్రభుత్వానికి తెలియకుండా సర్క్యులేషన్ విడుదలైందంటూ మాట్లాడడం సూచనీయమని వెంటనే ఈ సర్క్యులేషన్ను రద్దుచేసి శాంతి భద్రతలను కాపాడటంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గుర్తు లేకుండా సర్కులర్ జారీ చేశారనడం హాస్యాస్పదమని యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులపై పోలీసుల పెత్తనం ఎప్పటికీ ఉండొద్దని ప్రజా పాలన ప్రభుత్వం స్వేచ్ఛకు నిదర్శనం అంటూనే నియంత పాలన చేయడం సబాబు కాదని వక్తలు అభిప్రాయాలను వెల్లడించారు.

## మంత్రి సీతక్క వర్సెస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**బలగం టీవీ , హైదరాబాద్**

'తమ్ముడూ నీ లైఫ్ స్టైల్ వేరు..నా లైఫ్ స్టైల్ వేరు, ప్రభుత్వం వసతి కల్పించిన క్వార్టర్‌లోనే నేను నివసిస్తున్నాను, మీలా ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోటల్లో నివసించడం లేదు' అని శాసనసభ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నియోజకవర్గంలో నేను తిరిగినట్లు నువ్వు తిరగలేవు, ప్రజలకు ఎవరు ఎక్కువ అందుబాటులో ఉంటారో తేల్చుకుందాం' అని మంత్రి గట్టి కౌంటర్ ఇచ్చారు. శాసనసభలో శనివారం పలు పద్దులపై జరిగిన చర్చలో పాల్గొన్న కౌషిక్ రెడ్డి సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదన్న వ్యాఖ్యలను సీతక్క ఖండించారు. ఈ సందర్భంగా కాసేపు ఇద్దరి మధ్య వాగ్వాదం ఆసక్తిగా జరిగింది. హైదరాబాద్‌లో తిరిగే వాళ్లకు రైతులకు బోనస్ వస్తుందో లేదో తెలుస్తుందా?, రైతులతో సంబంధం లేకుండా హైదరాబాద్‌లో తిరుగున్నట్లు ఉందని మంత్రి మండిపడ్డారు. బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేసింది మీరేనని, వరి వేస్తే ఉరి అన్నది కూడా మీరేనని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం సన్న వడ్లకు రూ.1200 కోట్లు బోనస్ ఇచ్చిందని, ఇంకా ఎవరికన్నా రాకపోతే అవి కూడా ఇస్తామని సభావేదికగా మంత్రి సీతక్క వెల్లడించారు. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామని, భూమి లేని వాళ్లకే కూలీ భరోసా ఇస్తున్నామని చెప్పారు.

నాది నిరాడంబర జీవితం, నా కుమారుడు కూడా హన్మకొండ లోనే ఉంటాడని మంత్రి సీతక్క అన్నారు. నీ జీవన విధానం, నా జీవన విధానం ప్రజలకు తెలుసునని పాడి కౌశిక్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. వైయస్ఆర్ భవనంలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మా ఇంటికి వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని అన్న సీతక్క టిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మా ఇంటికి రావాలని ఆహ్వానం పలుకుతున్నానని అన్నారు. మీ అందరిని భోజనానికి ఆహ్వానిస్తున్నాను, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఆహ్వానించలేదని అన్నారు.

మంత్రి సీతక్కను తానేమీ అనరాని మాటలు ఏమీ అనలేదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వివరణ ఇచ్చారు. మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసిన అనంతరం కౌశిక్‌రెడ్డి స్పందిస్తూ మీరు ప్రభుత్వ భవనంలో ఉన్నారని మాత్రమే అన్నాను తప్ప ఇంకేమీ అనలేదని అన్నారు. తాను మాత్రం కోటలో లేనని, 500 గజాల ఇంట్లోనే ఉంటున్నానని బదులిచ్చారు. ప్రభుత్వం సిఎం కోసం నిర్మించి ఇంట్లో ఉంటున్నారని అన్నాను తప్ప ఎలాంటి విమర్శలు చేయలేదని అన్నారు. ఈ విషయంపై కొందరు కాంగ్రెస్ సభ్యులు రికార్డుల నుంచి కౌశిక్‌రెడ్డి మాటలు తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుని ఒక గిరిజన మహిళ, మంత్రి అయిన సీతక్కను ఉద్దేశించి ఇలా మాట్లాడడం కరెక్ట్ కాదని అన్నారు. శ్రీధర్ అన్నగారు తనకు గురువుతో సమానమని, రాజకీయం తాను ఆయన నుంచే నేర్చుకున్నానని కౌషిక్ రెడ్డి అన్నారు. దీంతో కాసేపు వాగ్వాదం తర్వాత మరో సభ్యుడు మాట్లాడడంతో సద్దుమణిగింది.

# ఆర్సీబీ శుభారంభం



- రాణించిన విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్
- 7 వికెట్ల తేడాతో గెలిచిన బెంగళూరు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభ మ్యాచ్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు శుభారంభం చేసింది. డిఫెండింగ్ చాంప్ కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. విరాట్ కోహ్లీ(59 నాటౌట్ : 4 ఫోర్లు, 3 సిక్సర్లు), ఫిలిప్ సాల్ట్(56)లు విధ్వంసక బ్యాటింగ్ చేశారు.

ఈడెన్ గార్డెన్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 174 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే(31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. సునీల్ నరైన్(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 44), అంగ్‌క్రిష్ రఘువంశీ(22 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 30) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా(3/29) మూడు వికెట్లు తీయగా..జోష్ హాజెల్‌వుడ్(2/22) రెండు వికెట్లు పడగొట్టాడు. సుయాశ్ శర్మ, రసిఖ్ సలామ్, యశ్ దయాల్ తలో వికెట్ తీసారు. రహానే- నరైన్ ధాటికి ఓ దశలో కేకేఆర్ 220 ప్లస్ స్కోర్ చేసేలా కనిపించింది. కానీ కృనాల్ పాండ్యా సంచలన బౌలింగ్‌తో కేకేఆర్‌ను సాధారణ స్కోర్‌కే కట్టడి చేశారు.

అనంతరం ఛేదనలో మొదటి ఓవర్ నుంచే ఓపెనర్లు విరాట్ కోహ్లీ(59 నాటౌట్: 4 ఫోర్లు, 3 సిక్సర్లు), ఫిలిప్ సాల్ట్(56)లు దూకుడుగా ఆడారు. కెప్టెన్ రజత్ పటీదార్(16 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 34 ) కూడా దూకుడుగా ఆడాడు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, వైభవ్ అరోరా తలో వికెట్ తీసారు.



## బాక్సింగ్ దిగ్గజం జార్జ్ ఫొరెమాన్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**

బాక్సింగ్ దిగ్గజం జార్జ్ ఫొరెమాన్ కన్నుమూశాడు. అమెరికాకు చెందిన ఆయన 76 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచాడు. శుక్రవారం ఈ బాక్సింగ్ దిగ్గజం మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. అయితే.. జార్జ్ మరణించడానికి కారణం ఏంటి? అనేది తెలియాల్సి ఉంది. బాక్సింగ్ రింగ్ నుంచి వైదొలిగాక జార్జ్.. క్రైస్తవ మత బోధకుడిగా కొన్నాళ్లు సేవలందించాడు. దాంతో, ఆయన మరణవార్త విని పలువురు కంటతడి పెడుతున్నారు."జార్జ్ ఫొరెమాన్ ఒక మంచి బోధకుడు, మంచి భర్త, పిల్లల్ని ఎంతగానో ప్రేమించే తండ్రి. ఆయన తన జీవితాన్ని చాలా గొప్పగా గడిపారు. లక్షలాది మంది అభిమానుల నమ్మకం చూరగొన్న ఆయన మానవతావాదిగానూ ప్రసిద్ధి. రెండు సార్లు హెవీ వెయిట్ చాంపియన్ అయిన జార్జ్.. మరణంతో మా హృదయం ముక్కలైంది" అంటూ కుటుంబసభ్యులు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు.

అమెరికాలోని టెక్సాస్‌లో 1949లో జన్మించాడు జార్జ్. చిన్నప్పుడే బడి మానేసిన అతడు.. వీధుల్లో తన ఈడు పిల్లలతో పోట్లాడేవాడు. అల్లరచిల్లరగా తిరుగుతున్న అతడు యవ్వనంలో బాక్సింగ్ మీద దృష్టి సారించాడు. తొలి టైటిల్ వేటలో మహ్మద్ అలీ చేతిలో కంగుతిన్న జార్జ్ 19 ఏళ్లకు తన శక్తిని ప్రపంచానికి చాటాడు. తన పంచ్ వపవర్ చూపిస్తూ.. 1968లో జరిగిన ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు. కెరియర్‌లో 76 మ్యాచుల్లో జార్జ్ విజేతగా నిలవగా.. వాటిలో ఏకంగా 68సార్లు నాకౌట్ చేయడం విశేషం. 28 ఏళ్లకే ఆటకు అల్విదా

## పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న శివరాజ్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్ కుమార్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆయన తన సతీమణితో కలిసి పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్దమ్మ తల్లి ఆలయానికి శివరాజ్ కుమార్ విచ్చేసిన విషయం తెలుసుకుని, అభిమానులు ఆయనను చూసేందుకు ఆసక్తి కనబరిచారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్సీ 16' చిత్రంలో శివరాజ్ కుమార్ ఓ కీలక పాత్ర పోషించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొనేందుకు ఆయన హైదరాబాద్ చేరుకున్నారు.




## లింగ వివక్షపై పూజాహెగ్డే వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**

పూజా హెగ్డే ఇండస్ట్రీలో లింగ వివక్షపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. సినిమా అనేది సమష్టి కృషి అని, అందులో ప్రతి ఒక్కరికీ భాగం ఉంటుందని పేర్కొంది. సినిమా సెట్‌లోనూ హీరోయిన్లు లింగ వివక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. కొన్నిసార్లు పోస్టర్లపై సైతం క్రెడిట్ ఇవ్వరు అంటూ వ్యాఖ్యానించింది. అన్ని పరిశ్రమల్లోనూ లింగ వివక్ష ఉంటుటుందని.. ఒక్కోచోట ఒక్కోరకంగా ఉంటుందని పేర్కొంది. పరిస్థితులను బట్టి.. స్థాయిని బట్టి మారుపోతుంటుందని పేర్కొంది. ఉదాహరణకు హీరో వ్యానిటీ వ్యాన్ మూవీ షూటింగ్ జరిగే సెట్ ను పక్కనే ఉంటుందని.. మిగతా వారికి దూరంగా ఉంటాయని పేర్కొంది. హీరోయిన్లు బరువైన క్యాస్టూమ్స్, పెద్ద పెద్ద లెహంగాలు ధరించి సెట్ వరకు నడుచుకుంటూ రావాల్సి ఉంటుందని.. కొన్నిసార్లు చూసేందుకు బాగున్నా.. బరువైన దుస్తులను వేసుకొని వచ్చి.. షాట్ అయ్యాక దూరం అలాగే వెళ్లడం కూడా అదో రకమైన వివక్ష అని వాపోయింది. లింగ వివక్ష సంక్లిష్టమైందని.. సినిమా పోస్టర్‌లోనూ పేరు ఉండకపోవచ్చని చెప్పింది. కొన్నిసార్లు ప్రేమకథ అయినా క్రెడిట్ ఇవ్వరని చెప్పింది. సినిమా అనేది సమష్టి కృషి అని అందరూ గుర్తించాలని కోరింది.

దశాబ్దాలుగా పని చేస్తున్న స్టార్‌తో కలిసి పని చేసినట్లు చెప్పింది. సల్మాన్ ఖాన్, ప్రభాస్ బడా స్టార్ హీరోలతో కలిసి నటించానని.. వారి నుంచి ఎన్నో విషయాలను నేర్చుకున్నానని చెప్పింది. బాలీవుడ్ నటి అనుష్క శర్మ అంటే తనకు చాలా ఇష్టమని అన్నారు. తాను స్టార్ హోటల్‌లో గదులు, సమీపంలోని వ్యానిటీ వ్యాన్‌లు వంటి చిన్న చిన్న విషయాల కోసం పోరాడనని చెప్పింది. భావోద్వేగ సన్నివేశాల కోసం సహనటుడు సెట్‌లో ఉండేలా తాను పోరాడాలనుకుంటున్నానని.. ఎందుకంటే తరచుగా.. వారి స్థానంలో బాడీ డబుల్స్ మోహరిస్తారన్నారు. వర్క్ క్వారిటీని ప్రభావితం చేసే అంశాలపై పోరాడాలనుకుంటున్నానని చెప్పింది. ఈ సందర్భంగా హీరోలు సూర్యా, విజయ్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్‌పై ప్రశంసలు కురిపించింది.





## అంగరంగ వైభవంగా ఐపీఎల్ ఆరంభ వేడుకలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 ఆరంభ వేడుకలు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో అట్టహాసంగా జరిగాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్.. అదే టీమ్ ఆటగాడు రింకు సింగ్‌తో కలిసి డ్యాన్స్ చేసి అదరగొట్టారు. వేడుకలను బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ ప్రారంభించగా.. ప్రఖ్యాత సింగర్ శ్రేయా ఘోషల్ తన మధురమైన పాటలతో అలరించారు. ఆమి ఝే తోమర్ పాటతో మొదలు పెట్టిన శ్రేయా.. మా తుఝే సలాం సాంగ్‌తో తన ప్రదర్శనను ముగించారు. అనంతరం దిశా పటానీ తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. పలు హిందీ సాంగ్స్‌కు దిశా పటానీ చిందేసింది. ఆ తర్వాత ప్రముఖ ర్యాపర్ కరణ్ ఆజ్లా తన గాత్రంతో అభిమానులను అలరించాడు.

అనంతరం షారూఖ్ ఖాన్ ఈ వేడుకలకు హెూస్ట్‌గా వ్యవహరించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీని స్టేజీపైకి ఆహ్వానించాడు. 18 సీజన్లుగా ఆడుతూ అద్భుత ప్రదర్శన కనబర్చిన ఆటగాడిగా అతనిపై ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లీతో సరదాగా మాట్లాడిన షారూఖ్ ఖాన్.. అనంతరం కేకేఆర్ సెన్సేషన్ రింకూ సింగ్‌ను కూడా స్టేజీపైకి ఆహ్వానించాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి గోల్డెన్ జనరేషన్ ఆటగాళ్లకు కుర్రాళ్లు





పోటీ ఇస్తారా? అని రింకూ సింగ్‌ను ప్రశ్నించగా.. తాను కూడా ఆ జనరేషన్ ఆటగాడినేని, వాళ్ల ఓల్డ్ జనరేషన్ కాదని బదులిచ్చాడు. అనంతరం రింకూ సింగ్‌తో కలిసి షారూఖ్ ఖాన్ డ్యాన్స్ చేయగా.. ఆ తర్వాత కోహ్లీ కూడా షారూఖ్‌తో కలిసి డ్యాన్స్ చేశాడు. అనంతరం బీసీసీఐ పెద్దలతో పాటు ఆరంభ వేడుకల్లో పాల్గొన్న సెలెబ్రిటీలను స్టేజీపైకి షారుఖ్ ఖాన్ ఆహ్వానించగా.. కేకేఆర్, ఆర్సీబీ కెప్టెన్లు అజింక్యా రహానే, రజత్ పటీదార్‌లు ట్రోఫీని స్టేజిపైకి తీసుకొచ్చారు. బీసీసీఐ పెద్దలంతా కలిసి భారీ కేకును కట్ చేసి ఐపీఎల్ 2025 సీజన్‌ను ప్రారంభించారు. జాతీయ గీతంతో ఆరంభ వేడుకలను ముగించారు.



## సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసు ముగిసింది

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణానికి సంబంధించిన కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దర్యాప్తు ముగిసింది. సీబీఐ తన దర్యాప్తు ముగింపు నివేదికను కోర్టుకు సమర్పించింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ 2020 జూన్ 14న ముంబైలోని బాంద్రాలోని తన నివాసంలో ఉరివేసుకుని చనిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసును సీబీఐకి అప్పగించిన తర్వాత, దర్యాప్తు సంస్థ దాదాపు నాలుగేళ్లపాటు అనేక కోణాల్లో విచారణ జరిపింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ తండ్రి... రియా చక్రవర్తిపై చేసిన ఆరోపణలు, అదే విధంగా రియా చక్రవర్తి, సుశాంత్ కుటుంబంపై చేసిన ఆరోపణలకు సంబంధించి రెండు కేసుల్లో సీబీఐ తన నివేదికను సమర్పించింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ను ఎవరైనా ఆత్మహత్యకు ప్రేరేపించారనేందుకు ఎటువంటి ఆధారాలు లేవని సీబీఐ నిర్ధారించింది. రియా చక్రవర్తి, ఆమె కుటుంబానికి ఈ కేసులో క్లీన్ చిట్ లభించింది. ముంబై పోలీసులు మొదట ఇది ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. అయితే, సుశాంత్ కుటుంబం రియా చక్రవర్తిపై చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని బీహార్ ప్రభుత్వం సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2020 ఆగస్టు 19న సీబీఐ ఈ కేసును స్వీకరించింది.